క్లుప్తంగా

ఉచిత మంచినీటి సరఫరా



నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట్ గ్రామంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటి ఎద్దడి నివారణకు ముందుకు వచ్చిన మండల నాయకుడు గంగనర్సయ్యను అభినందించారు.

రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి



కెపాసిటర్లతో రైతులు

రాయికల్: విద్యుత్ వినియోగం, లోడ్ పెరుగుతున్నందున రైతులందరూ తమ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని ఏడీఈ హరీశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ సెక్షన్ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కెపాసిటర్లు బిగించుకోవడంతో విద్యుత్ లోడ్ తక్కువ కావడంతో పాటు లోఓల్టేజీ సమస్య తగ్గిపోయి మోటార్లు కాలిపోకుండా ఉంటాయని వివరించారు. రైతులు ఆటో స్టార్టర్లను తొలగించి కెపాసిటర్లను బిగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఒడ్డెలింగాపూర్ ఏఈ రాజేశం, లైన్‌మెన్ రఘుపతి, రైతులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వాటర్ కూలర్ ఏర్పాటు

కోరుట్ల: పట్టణంలోని టీఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను డిపో మేనేజర్ లక్ష్మీప్రసూన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు చల్లని నీళ్ల అందించాలనే ఉద్దేశంతోనే వాటర్ కూలర్ ఏర్పాటు చేశామని, ప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు. ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



పెగడపల్లి: పెగడపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా కె.కుమారస్వామి బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎస్సై శ్వేత రెండు నెలల క్రితం బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో రిజర్వ్ ఎస్సైగా ఉన్న కుమారస్వామిని నియమిస్తూ ఎస్పీ భాస్కర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న సామాజిక సేవకులు

రాయికల్: పట్టణానికి చెందిన సామాజిక సేవకులు కడకుంట్ల జగదీశ్వర్–శ్వేత దంపతులు శుక్రవారం ధర్మాజీపేట గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. నాయకులు మారంపల్లి హరీశ్, సామాజిక కార్యకర్తలు సాయికుమార్, శ్రీనివాస్, విజయ్, ఎద్దండి ముత్యంరాజు, రసూల్, కిరణ్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ నేమూరి లత ప్రారంభించారు. మొదటిరోజు చలివేంద్రంలో అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, నాయకులు నేమూరి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి చెదలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కోరుట్ల సీఐ పర్యటన

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, చింతకుంట, దుంపేట గ్రామాల్లో కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్సై శ్వేత ఉన్నారు.

లింకు రోడ్డుకు మరమ్మతులెప్పుడో?

- సంగెం – యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికుల డిమాండ్



సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య లింకు రోడ్డు

కోరుట్ల రూరల్ : మండలంలోని సంగెం- యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్డుకు మోక్షం లభించడం లేదు. వర్షాకాలం కురిసిన భారీ వర్షాలకు లింకు రోడ్డు దెబ్బతినడంతో పాటు రెండు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పెద్దవాగులో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

రెండు గ్రామాలకు ఇదే ప్రధాన దారి..

సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య వ్యవసాయ పనులు, ఇతరత్రా రోజువారీ కార్యకలాపాలతో పాటు కథలాపూర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు ఇదే లింకురోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. అంతేకాకుండా రైతులకు ఉపయోగపడే ప్రాథమిక సహకార బ్యాంకు, రైస్ మిల్లులు కూడా యెఖీన్‌పూర్ గ్రామంలోనే ఉన్నాయి. దీంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగానే ఉంటుంది. యెఖీన్‌పూర్ గ్రామానికి చెందిన పలువురు రైతుల పొలాలు సంగెం శివారులో ఉండటంతో పెద్దవాగు దాటి సంగెం మీదుగానే పొలం పనులకు వెళ్లాల్సి ఉంటుంది.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు..

పెద్దవాగులో ఇసుక దిబ్బల నుంచి ప్రయాణించేందుకు వీలుగా గతంలో వాగులో తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ వర్షాకాలంలో వాగు ఉధృతికి కొట్టుకుపోయి ఇసుక మేట వేసింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్రవాహనాలు మినహా ఏ వాహనాలు వాగులో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు గ్రామాల మధ్య ఉన్న ఈ లింకు రోడ్డు కిలో మీటర్ దూరమే ఉన్నప్పటికీ వాగులో దెబ్బతిన్న రోడ్డు కారణంగా కార్లు, లోడింగ్ ఆటోలు ఇతరత్రా వాహనాలు కోరుట్ల మీదుగా సుమారు 10 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వ స్తోంది. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని మరమ్మతులు చేపట్టాలని రెండుగ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

బీటీరోడ్డు నిర్మించాలి



ఈలింకు రోడ్డు సంగెం-యెఖీన్‌పూర్ గ్రామస్తులకే కాకుండా మేడిపెల్లి, కథలాపూర్ మండలాలకు కూడా తక్కువ దూరంలో ఉంటుంది. రైతులు, ఇతర ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు చొరవ తీసుకొని బీటీ రోడ్డుగా మారిస్తే బాగుంటుంది. – రాంచందర్ రావు, కాంగ్రెస్ నాయకుడు

ప్రతిపాదనలు చేయలేదు



లింకురోడ్డు మరమ్మతు గురించి ఇప్పటికీ ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ప్రస్తుతం పెద్ద వాగుపై వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వంతెన పనులు పూర్తయితే రోడ్డు స్థలం ప్రాపర్‌గా గుర్తిస్తే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయొచ్చు. – గోపాల్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

వైభవంగా సీతారామస్వామి రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు

రాయికల్: మండలంలోని గ్రామంలోని సీతారామ చంద్రస్వామి రథోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులను ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ప్రతిష్ఠించి రథాన్ని ఆలయం చుట్టూ తిప్పారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, సర్పంచ్ సాగరిక, సర్పంచులు నందునాయక్, రాజమౌళి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మదన్‌మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



లొంకలో నీటిని తీసుకుంటున్న భక్తులు

తాట్లవాయి కొండపైకి పోటెత్తిన భక్తులు

రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలోని మూడు కిలోమీటర్ల ఎత్తైన కొండపై గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం పొద్దున వరకు గుట్టపై నున్న సీతారామస్వామిని దర్శించుకుని లొంకలోంచి వెళ్లారు. లొంకలో ఉన్న నీటిని తీసుకొచ్చి తమ పంటపొలాల్లో చల్లుకుంటారు. అలా చల్లితే పంటలు సమృద్ధిగా పండుతాయని రైతుల నమ్మకం. సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా.

ప్రారంభమైన వరికోతలు



హార్వెస్టర్‌తో వరిపంటను కోయిస్తున్న రైతు

పెగడపల్లి: రబీ సీజన్‌లో సాగుచేసిన వరికోతలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో కురిసిన వర్షాల ఆధారంగా రబీ పనులకు శ్రీకారం చుట్టిన రైతులు ఎస్సారెస్పీ కాలువతో పాటు బావుల ఆధారంగా ఎక్కువశాతం మంది రైతులు వరిపంటనే సాగు చేశారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు ప్రచారం చేసినా.. రైతులు మాత్రం వరివైపే మొగ్గు చూపారు. రబీలో సాగైన వరిపైరు ప్రస్తుతం కోతకు రావడంతో 3, 4 రోజులుగా హార్వెస్టర్ల సాయంతో కోతలు ప్రారంభించారు. రెండు, మూడు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా రైతులు అప్రమత్తమై కోతలు ప్రారంభించారు.

మంత్రిని కలిసిన రెడ్డి సంఘం ప్రతినిధులు

పెగడపల్లి: మండలంలో నూతనంగా ఎన్నికైన నందగిరి గ్రామశాఖ రెడ్డి సంఘం ప్రతినిధులు మంత్రి ఈశ్వర్‌ను కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, సభ్యులు సత్యనారాయణరెడ్డి, అరుణ్‌రెడ్డి, గోపు రాజిరెడ్డి, సంకిటి లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

‘ఇంటింటికీ బీజేపీ’ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కథలాపూర్: పల్లె పల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాముల ప్రకాశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేయాలని, బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్డాటి సునీల్, నాయకులు కథలాపూర్ మహేశ్, వడ్లకొండ రాజు, వల్లకొండ నవీన్, మల్యాల శ్రీకర్, జవ్వాజి మధు, తొగిలి లక్ష్మణ్‌చారి, గన్నారపు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి అధికారికంగా నిర్వహించాలి

మల్లాపూర్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామపంచాయతీల్లోని విగ్రహాలకు రంగులు వేయించి గ్రామగ్రామాన వేడుకలు చేపట్టాలన్నారు.

సంక్షిప్త వార్తలు

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంలో టౌన్-1 సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు. టౌన్-1 సెక్షన్ పరిధిలోని రాంబజార్, పురాణిపేట, అంగడిబజార్, యావర్‌రోడ్, మార్కెట్ వెనుకాల, కృష్ణానగర్, అరవింద్‌నగర్, మార్కండేయ ఆలయం వీధి, టాకాసంది, సాయిరాంనగర్, గోవిందుపల్లి, శ్రీరాంనగర్, వెంకటాద్రినగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

✦మల్యాలలో బలగం సినిమా ప్రదర్శన

మల్యాల: మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో శుక్రవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. గ్రామ సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో సినిమా ప్రదర్శన నిర్వహించగా, వందలాదిమంది ప్రజలు సినిమాను తిలకించారు.

✦టీడీపీ హయాంలోనే అభివృద్ధి

మల్లాపూర్: టీడీపీ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని పార్టీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ ఎం ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కుస్తాపూర్, సిరిపూర్ గ్రామాల్లో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సాదుల్లా, మాధవరెడ్డి, వెంకటేశం, ఆజు, గణేశ్, శ్రీనివాస్, మారుతి, మహాదేవ్, రాజేందర్ పాల్గొన్నారు.

✦ఇంటింటికీ టీడీపీ

సారంగాపూర్: టీడీపీ హయాంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించిందని పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి మహంకాళి రాజన్న అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇంటింటికీ తెలుదేశం కార్యక్రమంలో భాగంగా బీర్‌పూర్ మండలం తుంగూర్, కమ్మునూర్, రేకులపల్లి గ్రామాల్లో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం హయాంలో జరిగిన కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కాగా సురివి సంతోష్‌రావు టీడీపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట జిల్లా నాయకులు బత్తుల కొండయ్య, అడ్వకేట్ ఎస్.విజయ్‌కుమార్, నక్క లక్ష్మణ్, సురివి సంతోష్‌రావు ఉన్నారు.

రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయం



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న బీజేవైఎం నాయకులు

ధర్మపురి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని బీజేవైఎం నాయకులు గాజు భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్, రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ నిరంకుశ పాలనను తరిమికొట్టి రాష్ట్రంలో రామరాజ్యాన్ని తెచ్చేది ఒక్క బీజేపీ పార్టేనని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నరెల్ల శంకర్, నాయకులు ఓరుగంటి కిరణ్, సంగి మాధవ్, కస్తూరి రాజన్న, స్తంబంకాడి శ్యామ్, వెలుగందుల ప్రణీత్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రహదారి మురుగుమయం

ధర్మపురి: పట్టణంలోని బోయవాడలో డ్రైనేజీలో చెత్తా చెదారం చేరి నీరు వెళ్లకపోవడంతో అందులోని మురుగు నీరంతా బయటకు వచ్చింది. దీంతో బోయవాడ రహదారి దుర్గంధంగా మారింది. ప్రజలు ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. గోదావరి స్నానాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్
ఫోన్ నంబర్: 88866 49053

సీపీఆర్‌పై వైద్యసిబ్బందికి శిక్షణ



కథలాపూర్: శిక్షణ ఇస్తున్న ప్రత్యేక వైద్యాధికారి



మల్లాపూర్: శిక్షణలో పాల్గొన్న వైద్యసిబ్బంది

కథలాపూర్: గుండెపోటుకు గురైన వారికి అత్యవసర సమయంలో అందించే సీపీఆర్‌పై కథలాపూర్ పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. రోగికి అత్యవసర సమయంలో సీపీఆర్ చేయడంతో వారిని బతికించవచ్చన్నారు. ప్రత్యేక వైద్యాధికారి అనిల్, స్థానిక వైద్యాధికారి సింధూజ, సీహెచ్‌వో వెంకన్న, సూపర్‌వైజర్ భూషణ్, చిన్న రాజం, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

మల్లాపూర్ పీహెచ్‌సీలో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు సీపీఆర్‌పై వైద్యాధికారి వాహిని ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఎల్లాల అంజిత్‌రెడ్డి కార్డియో పల్మనరీ రిసస్టేషన్ ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. తీవ్రమైన గుండెపోటుకు గురైనప్పుడు శరీరంలో రక్తంలో ఆక్సిజన్ సరఫరా ఆగిపోతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇందిర, గోదావరి, రమ్య కృష్ణ, సుమలత, రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

కోరుట్ల/కోరుట్లటౌన్: పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జాతీయ రహదారి వెంట వైద్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజలు జీవన విధానంలో మార్పు చేసుకోవాలని సూచించారు. ‘హెల్త్ ఫర్ ఆల్’ బ్యానర్‌తో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. సీనియర్ వైద్యులు డాక్టర్ అనూప్‌రావు, డాక్టర్ దిలీప్‌రావు, డాక్టర్ మహాదేవ్, డాక్టర్ వేముల ప్రభాకర్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రేగొండ రాజేశ్, సెక్రటరీ డాక్టర్ కటుకం జగదీశ్వర్, ట్రెజరర్ డాక్టర్ అన్వేష్, డాక్టర్ శంకర్, డాక్టర్ రమేశ్, డాక్టర్ మనోజ్, డాక్టర్ ఇంద్రనీల్, డాక్టర్ నరేశ్, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ రాజేశ్, డాక్టర్ సంతోష్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రంగనాథ్, డాక్టర్ సాజిద్, డాక్టర్ అనురాగ్, డాక్టర్ స్వీతి అనూప్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ హర్షిత, డాక్టర్ అనురాధ జగదీశ్వర్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మధుశ్రీ, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ శృతి, డాక్టర్ దీప్తిరెడ్డి, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు



సందేశమిస్తున్న పాస్టర్ సామ్యేల్

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, తాండ్రియాల, కథలాపూర్ చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు గసికంటి సామ్యేల్, బ్రదర్ కిషన్, గాంధారి లక్ష్మీనారాయణ, పాలెపు రాజేశ్ పాల్గొన్నారు.

మేదరి కులబాంధవుల సమస్యల పరిష్కారానికి కృషి



సంతోష్‌ను అభినందిస్తున్న ప్రతినిధులు

జగిత్యాలటౌన్: మేదరి కుల బాంధవులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహేంద్ర(మేదరి) సంఘం రాజకీయ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు వేముల సంతోష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మేదరి సంఘం రాజకీయ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షునిగా వేముల సంతోష్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఇందూరి గంగాధర్ ప్రకటించారు. సంతోష్ నియామకంపై బీజేపీ నాయకులు లింగంపేట శ్రీనివాస్, అంకారి సుధాకర్, గాజోజు సంతోష్, జిట్టవేణి అరుణ్ సంతోషం వ్యక్తం చేశారు.